క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ప్రకాశం నగర్: సీతంపేట గ్రంథాలయం వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వైరస్, బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధులపై ఎస్.దీప్తిశ్రీ అవగాహన కల్పించారు. శుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. శిక్షణ తరగతులను వీఆర్వో దుర్గ పర్యవేక్షించారు. గ్రంథాలయ ఉద్యోగులు ఎం.వీరలింగం, డి.రాజు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులపై హెచ్‌ఎంలతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో నాడు - నేడు ఫేజ్ - 2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ శనివారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమీక్షించారు. పనులు , నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను హెచ్‌ఎంల నుంచి సేకరించారు. ఖాతాలో నిధులు ఉండీ పనులు చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయుల సందేహాలను నగరపాలక సంస్థ ఈఈ శేషగిరిరావు నివృత్తి చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈఓ - 2 రమా రజని, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: హరిద్వార్ నుంచి వచ్చిన స్వామి రాందేవ్ బాబా శిష్యుడు స్వామి రిత్‌దేవ్ ఆధ్వర్యంలో రేపటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ యోగా శిక్షణ ఇవ్వనున్నారని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ఇంటర్నేషనల్ యోగా జడ్జి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పతంజలి యోగా అధ్యక్షుడు కర్రి నాగ వెంకట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 6.30 వరకూ గౌతమీ ఘాట్‌లోని సత్యసాయి ధ్యాన మండలిలో యోగా, ప్రాణాయామం, ధ్యానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కృష్ణబాబు సేవలు చిరస్మరణీయం



కృష్ణబాబు చిత్రపటానికి నమస్కరిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) సేవలు చిరస్మరణీయమని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. దొమ్మేరు గ్రామంలో శనివారం కృష్ణబాబు అల్లుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కృష్ణ బాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రౌతు వెంట మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ ఉన్నారు.

జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్



సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్ మనోజ్

కడియం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే పలు గ్రామాలలో పర్యటించి సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల కోడ్‌పై సూచనలు చేశారు. పోలింగ్ పూర్తయినంత మాత్రాన ఎన్నికల కోడ్ రద్దు కాదన్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ కోడ్ అమలులో ఉంటుందని అందువల్ల ఎక్కడా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. కౌంటింగ్ అనంతరం ఆకతాయులు ఫ్లెక్సీలను పాడుచేయడం వంటి చర్యలు వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారన్నారు.

మొక్కలకు నీడ.. రైతులకు ఆదాయం



నర్సరీ మొక్కల మధ్య నాటిన స్వీట్ కార్న్ మొక్కలు



స్వీట్ కార్న్ మొక్కల నీడలో విలువైన నర్సరీ మొక్కలు

- నర్సరీ రైతుల వినూత్న ఆలోచన
- విలువైన మొక్కల రక్షణకు మొక్కజొన్న కవచం
- అవిసె మొక్కలకు ప్రత్యామ్నాయం
- పొత్తులతో అదనపు ఆదాయం

కడియం: వేసవి తీవ్రత నుంచి మొక్కలను కాపాడుకునేందుకు కడియం ప్రాంత నర్సరీ రైతులు పలు మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. షేడ్ నెట్లు, పాలీ హౌస్‌లు వంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టాలంటే ఎక్కువ మంది రైతులకు సాధ్యం కాదు. దీంతో తాత్కాలిక ప్రత్యామ్నాయ పద్ధతులు పాటిస్తారు. నర్సరీలోని మొక్కల మధ్య గతంలో అవిసె మొక్కలను నాటేవారు. వేసవి ఎండలు ముదరడానికి నెల రోజులు ముందుగానే అవిసె గింజలను తీసుకువచ్చి భూమిలో పాతేవారు. అవి అత్యంత వేగంగా సుమారు నెల రోజుల్లోనే ఏపుగా పెరిగేవి. వాటి నీడలో ఉండే విలువైన మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణ లభించేది.

స్వీట్ కార్న్‌తో ప్రయోజనం

ప్రస్తుతం మరో ప్రత్యామ్నాయం ఆలోచించారు. అవిసె మొక్కలకు బదులుగా స్వీట్ కార్న్‌ను నాటుతున్నారు. నర్సరీ మొక్కల వరసల మధ్య పెరిగిన స్వీట్‌కార్న్ ఎండ తీవ్రత నుంచి ఆయా మొక్కలకు రక్షణ లభిస్తుంది. అలాగే స్వీట్ కార్న్ పొత్తుల ద్వారా రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. అవిసె మొక్కలతో ఎటువంటి ఆదాయం ఉండదు. కేవలం మిగిలిన మొక్కలకు నీడను మాత్రమే ఇస్తాయి. దీంతో నీడతో పాటు ఆదాయాన్నిచ్చే స్వీట్ కార్న్ నాటేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతుల ఆసక్తి

అవిసె మొక్కలకు పురుగుల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. నీడ మాట ఎలా ఉన్నా, వీటికి వచ్చే తెగుళ్లు నర్సరీ మొక్కలకు కూడా వ్యాపిస్తుండేవి. అయితే స్వీట్ కార్న్‌తో ప్రస్తుతానికి అటువంటి సమస్యలేమీ లేవు. అవిసె మొక్కల మాదిరిగానే వేగంగా ఎదుగుతుండడంతో పాటు అదనపు ఆదాయం వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. కడియం ప్రాంతంలో పలువురు రైతులు స్వీట్ కార్న్ మొక్కలను నాటడంతో నర్సరీలు మొక్కజొన్న తోటలను తలపిస్తున్నాయి.

పురుగుల బెడద లేదు

అవిసె మొక్కలకు మునగకు మాదిరిగా సులభంగా గొంగళి పురుగు పడుతుంది. మంచి వేసవిలో ఒక జల్లు వర్షం పడితే పురుగులు వచ్చేస్తాయి. పురుగులు వచ్చాయని అవిసె మొక్కలను తొలగిస్తే.. వేసవి ఎండలకు నర్సరీ మొక్కలకు రక్షణ ఉండేది కాదు. అయితే స్వీట్ కార్న్ వల్ల ప్రస్తుతం ఇబ్బందుల్లేవు. జొన్నపొత్తుల ద్వారా అదనంగా ఆదాయం కూడా వస్తుంది. దీంతో రైతులు వీటిపై ఆసక్తి చూపిస్తున్నారు.

– పి.వెంకట్, నర్సరీ రైతు, దుళ్ల

అవిసెకు ప్రత్యామ్నాయం

వేసవిలో మొక్కలను కాపాడుకునేందుకు గతంలో అవిసె మొక్కలను నాటుకునేవాళ్లం. ఇటీవలే మొక్కజొన్నను ఎక్కువగా నాటుతున్నాం. ఇది కూడా వేగంగా పెరుగుతోంది. తొలగించేటప్పుడు కూడా పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. అవిసె మొక్కలను తొలగించేటప్పుడు వాటి కంపలు కింద ఉన్న మొక్కలపై పడి నష్టం కలిగేది. మొక్కజొన్నతో ఇప్పుడా ఇబ్బంది ఉండదు.

– కె.శ్రీనివాసరావు, నర్సరీ రైతు, కడియపులంక

కడియం హైస్కూల్ ఆయాలకు ద్వితీయస్థానం



ద్వితీయ స్థానంలో నిలిచిన కడియం హైస్కూల్ మిడ్డే మీల్స్ బృందం

కడియం: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న ఆయాలకు మే 21 నుంచి 24 వరకూ గన్నవరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పీఎం పోషణ స్కీం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిక్షణ అనంతరం పాఠశాలల్లో వారు తయారు చేసే వంటలపై పోటీలు నిర్వహించారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.అన్నపూర్ణ, ఈ.శాంతకుమారి శనివారం తయారు చేసే చక్కెర పొంగలి, పప్పు చారు, గ్రీన్ రైస్ అంశంలో ద్వితీయ స్థానం సాధించారు. వీరికి పీఎం పోషణ స్కీం నిర్వాహకులు కుక్కర్ బహుమతిగా అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ వి.వెంకటరాజు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా.. వంటల పోటీలో ద్వితీయ స్థానం సాధించిన అన్నపూర్ణ, శాంతకుమారిలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఉప విద్యాశాఖాధికారి ఈ.లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, ఎంఈఓలు నాగేశ్వరరావు, ఫణికుమార్, స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ అభినందించారు.

పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల కేసులపై సంబంధిత అధికారులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు గల ముఖ్య కారణాలను వివరించారు. కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపకపోవడం, అదే సమయంలో వివిధ సామాజిక మాధ్యమాలలో అపరిచితులతో పెరిగిన స్నేహాలతో చాలా మంది అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని, ఆ పిల్లల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారుతుందన్నారు. అలాంటి వారికి కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, న్యాయసేవలపై వివిధ ప్రభుత్వ శాఖలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నల్సావారి అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం 2015 ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలకు సంబంధించిన కేసులలో ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి కె.విజయ కుమారి, డీఈవో కె.వాసుదేవరావు, డీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ధవళేశ్వరం: చట్టాన్ని ఉల్లంఘించి దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్ మోహన్ హెచ్చరించారు. ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడుతున్నా, ఇబ్బందులు పెడుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ధవళేశ్వరం ఇందిరా కాలనీకి చెందిన గుబ్బల ఆశీష్ అనే యువకుడిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్ తెరిచామన్నారు. ఆశీష్‌పై 12 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఎస్పీ జగదీష్, డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచనల మేరకు బ్లేడ్ బ్యాచ్, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ సేవలు అభినందనీయం



మహిళలకు కుట్టు మెషీన్లు అందిస్తున్న సంధ్యారాణి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలకు ఉపాధి శిక్షణ ఇవ్వడానికి 26 ఏళ్లుగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవలు అభినందనీయమని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో శనివారం జరిగిన కుట్టు మెషీన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి, అభినందించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తేనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలకు కుట్టు, మగ్గం , బ్యూటీషియన్, కంప్యూటర్ తదితర వాటిలో శిక్షణ అందిస్తూ, వారి జీవనోపాధి కోసం కుట్టుమెషీన్లను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ సుమారు 20 వేల మందికి పైగా శిక్షణ అందించామని, సుమారు 750 మందికి కుట్టు మెషీన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు మహిళలకు సంధ్యారాణి చేతుల మీదుగా కుట్టుమెషీన్లు అందించారు. కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాస్ దివ్యగౌరీ గంగాధర్, స్వర్ణాంధ్ర సిబ్బంది శ్రీనివాస్ ఇలియాస్ పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులకు పూర్తిస్థాయిలో సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నన్నయ యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ సమయంలో నిర్వర్తించాల్సిన విధులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం నుంచి నన్నయ వర్సిటీకి బస్సులలో సిబ్బందిని తీసుకువెళతామన్నారు. కౌంటింగ్ హాలుకు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లకూడదన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత రిటర్నింగ్ అధికారి చెప్పేవరకూ బయటకు రాకూడదని సూచించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. అలాగే సర్వీసు ఓటర్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- 16 రౌండ్లలో ఫలితాల వెల్లడి
- ఆర్వో చైత్రవర్షిణి



చైత్రవర్షిణి, ఆర్వో

రాజానగరం: ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న నేపథ్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో 2,16,491 మంది ఓటర్లు ఉన్నారని, ఈనెల 13న జరిగి పోలింగ్‌లో 216 కేంద్రాల ద్వారా 1,89,508 మంది ఓటు చేశారన్నారు. ఈవీఎం యూనిట్లను నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో సాయుధ బలగాల పహారాతో భద్రంగా ఉన్నాయని తెలిపారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌ను 16 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈవీఎంలలో పోలైన ఓట్లు లెక్కింపునకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుళ్లు, ట్యాబ్లేషన్ టేబుళ్లు రెండు ఉంటాయని, 15 రౌండ్లు పూర్తయిన తరువాత 16వ రౌండు ఐదారు టేబుళ్లపై జరగడంతో లెక్కింపు పూర్తయి, ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున ఒక్కో టేబుల్‌కి ఒక ఏజెంట్‌ను మాత్రమే అనుమతిస్తారని, ఏజెంట్‌గా వెళ్లదలచిన వారు జూన్ ఒకటిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతానికి, ఏజెంట్లకు మధ్య ఇనుప తీగలతో కూడిన చట్రం అడ్డుగా ఉంటుందన్నారు. అలాగే లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించరన్నారు. లెక్కింపు కేంద్రానికి ఒక కిలోమీటర వరకూ 144 సెక్షన్‌తో పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతానికి నిర్ణీత పరిధిలో బాణసంచా కాల్పులు, విక్రయాలు నిషిద్ధమన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఆర్వో హెచ్చరించారు.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన మహిళలు

రాజానగరం: మగ్గం వర్క్‌కి మంచి డిమాండ్ ఉందని, దీని ద్వారా ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కు శిక్షణ తరగతులు శనివారం నందరాడలో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణకు తొలిరోజు 60 మంది మహిళలు హాజరయ్యారు. వీరందరికీ అవసరమైన మెటీరియల్‌ని అందజేసి, శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు ఎండీ సుంకర ప్రదీప్, సభ్యులు దుర్గ, నాగమణి, కిరణ్ సౌమ్య, మీనా, శిక్షకురాలు జంగిలి కుమారి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో క్యాన్సర్ శిక్షణ ప్రారంభం



క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణకు తరలివచ్చిన వైద్య సిబ్బంది

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శనివారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై మూడు రోజుల పాటు జరిగే శిక్షణ ప్రారంభమైంది. మెడికల్ కాలేజీలోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌ను ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్‌గా గుర్తించి జిల్లాలోని వైద్యుల బృందానికి ఈ శిక్షణ అందిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఎపిడిమాలజిస్ట్ సుధీర్ బాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ ప్రశాంత్, నోడల్ ఆఫీసర్ కమ్యూనిటీ మెడిసిన్, అంకాలజిస్టులు డాక్టర్ స్పందన, డాక్టర్ సమ్మె రాజా, డాక్టర్ రామరాజు, పాథాలజిస్ట్ డాక్టర్ శ్రీవల్లి తదితరులు వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల దానిస్థాయి పెరగకుండా వైద్యం అందించి, వ్యాధిని నివారించవచ్చన్నారు. శిక్షణలో తెలిపిన విషయాలను శ్రద్ధతో నేర్చుకొని ప్రజలందరికీ మంచి సేవలు అందించాలన్నారు. శిక్షణ పొందిన వైద్య బృందం కిందిస్థాయిలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలకు ట్రైనింగ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం యూనివర్సల్ స్క్రీనింగ్ మూడో దశ సర్వేను మొదలుపెట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, బాధితులను చికిత్స కోసం ఆసుపత్రులకు తరలిస్తారన్నారు. దీని ద్వారా రానున్న ఐదేళ్లలో క్యాన్సర్‌ను నియంత్రణలోకి తీసుకురావచ్చని, దీనికి ప్రజలందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, మెడికో సోషల్ వర్క్ ప్రసన్న పాల్గొన్నారు.

269 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యం అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: చినకొండేపూడి సచివాలయం-1 పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 269 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్ రాజు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎంలు వైశాలి, సంధ్య, ఆశా వర్కర్లు రాణి, కుమారి పాల్గొన్నారు.

సున్నంబట్టీ లేఅవుట్ రోడ్డులో వీధిలైట్ల ఏర్పాటు



విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కొండబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సున్నంబట్టీ లే అవుట్ క్వారీ రోడ్డులో రాత్రి సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, క్వారీ గోతుల్లో పడి పలువురు మృతి చెందుతున్న ఘటనలపై చేసిన పోరాటం ఫలితాన్ని ఇచ్చిందని గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్, నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు అన్నారు. సున్నంబట్టి లే అవుట్ రోడ్డులో ప్రమాదాలపై నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేయగా రూ.7 లక్షలు మంజూరు చేసి వీధి లైట్లను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారన్నారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న సంఘటనలపై, క్వారీ గోతులు పూడ్చాలని, రోడ్డు వేయాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించడంతో పాటు ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టానన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ దినేష్ కుమార్ మూడు అడుగుల రోడ్డును తాత్కాలికంగా 15 అడుగుల రోడ్డుగా విస్తరించారన్నారు. అలాగే వీధిలైట్లు వేసేందుకు రూ.7 లక్షలు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన స్తంభాలు, లైన్లు వేసి వీధిలైట్లు బిగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మార్గాని భరత్ రామ్, కమిషనర్ దినేష్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు వేయాల్సి ఉందన్నారు. ఈ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు క్వారీ యజమానులు కూడా ముందుకు వచ్చి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గోతులను పూడ్చాలని కొండబాబు కోరారు. కార్యక్రమంలో సున్నంబట్టి లేఅవుట్ కమిటీ(రాజరాజేశ్వరీ లేఅవుట్) అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి టి.బాబూరావు, డి.ప్రకాశం పాల్గొన్నారు.

సోడా తయారీ యూనిట్లపై దాడులు



సోడా యూనిట్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సోడా, కూల్‌డ్రింక్ యూనిట్లపై రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా రెండు సోడా తయారీ యూనిట్లపై కేసులు నమోదు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని కేశవరం రోడ్డులో ఉన్న రామ్స్ బేవరేజెస్ సోడా యూనిట్, కాకినాడ జిల్లా పెద్దాపురంలోని సంస్కృతి గోలి సోడా ఎంటర్‌ప్రైజెస్‌లో విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు లీటర్ల సోడా నమూనాలను విశ్లేషణకు సేకరించారు. అలాగే సోడా ఉత్పత్తులపై స్టాట్యుటరీ డిక్లరేషన్ లేకపోవడం, సంస్థ ప్యాకర్‌గా నమోదు లేకపోవడం, స్టాంపింగ్ లేని తూకం యంత్రం కలిగివుండడం వంటివి గుర్తించారు. రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, నవీన్, జీవా, శివ, వీరబాబు, కిషోర్, ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	లవ్ మీ
సూర్యమినీ	:	సిల్క్‌శారీ, డర్టీఫెలో
సూర్యప్యాలెస్	:	ఫ్యూరియోసా
స్వామి	:	కృష్ణమ్మ
శివజ్యోతి	:	లవ్ మీ
అనుశ్రీ	:	ఫ్యూరియోసా
రాజా	:	ఫ్యూరియోసా
ఊర్వశి	:	బాక్
రంభ	:	ఆ ఒక్కటీ అడక్కు
మేనక	:	ప్రసన్న వదనం
అప్సర	:	ఫ్యూరియోసా
కుమారి	:	రాజు యాదవ్
నామవరం		
వీఎస్ మహల్	:	లవ్ మీ
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	లవ్ మీ